సంపుటి :02 సంచిక :170 పేజీలు :08 వెల ₹5

# అక్షర దర్బార్

www.aksharadarbar.com

Voice of the people

గురువారం 28, ఆగస్టు 2025



# హైదరాబాద్‌కి బీచ్

## రూ.225 కోట్లతో కృత్రిమంగా ఏర్పాటు

పర్యాటకులను ఆకర్షించే అద్భుతమైన చారిత్రక కట్టడాలు, సంస్కృతికి హైదరాబాద్ ప్రసిద్ధి చెందింది. అయితే, సముద్ర తీరం లేకపోవడంతో బీచ్ అనుభూతిని పొందాలంటే నగరవాసులు సుదూర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోంది. ఇకపై ఆ అవసరం లేదు. ముత్యాల నగరానికి త్వరలో కృత్రిమ బీచ్ అందాలు తోడవ్వబోతున్నాయి.

- అక్షరదర్బార్, హైదరాబాద్

03

# చరిత్రలో మాయని మచ్చ

## బైరాన్‌పల్లి మారణకాండ

- మరో జలియన్‌వాలా బాగ్ అది..
- 1948 ఆగస్టు 27న గ్రామంలో రజాకార్ల ఊచకోత
- సాయుధులై గ్రామంలోకి 1,200 మంది ప్రవేశం
- విచక్షణరహితంగా కాల్పులు.. 118 మంది దుర్మరణం
- మహిళలను వివస్త్రలను చేసి బతుకమ్మ ఆడించిన దారుణం

**ఈ విషాదాంతానికి నిన్నటితో 77 ఏళ్లు..**

1948, ఆగస్టు 27... ఆ రోజు బైరాన్‌పల్లి ప్రజలకు ఒక పీడకల. తెల్లవారుజామున 4 గంటల వేళ, సుమారు 1,200 మంది రజాకార్లు అకస్మాత్తుగా ఆ ప్రశాంతమైన ఊరిపై దాడికి దిగారు. తుపాకీ మోతలు, ఫిరంగుల శబ్దాలు... క్షణాల్లోనే పల్లె స్మశానాన్ని తలపించింది. ఈ ఊచకోతలో 96 మంది అమాయకులు ప్రాణాలు కోల్పోయారు. అయితే, ఆ మారణ కాండలో అత్యంత హృదయ విదారకమైన అంశం.. అమరులైన యోధుల శవాల చుట్టూ, మహిళలను వివస్త్రలను చేసి బలవంతంగా బతుకమ్మ ఆడించడం. నిజాం పాలనలోని అమానవీయ కోణాన్ని, దొరల దురాగతాలను ఈ ఒక్క సంఘటన కళ్లకు కట్టింది. తమ ఆత్మగౌరవంపై జరిగిన ఈ దాడిని తట్టుకోలేక కొంతమంది మహిళలు ఆత్మహత్యలకు పాల్పడటం ఆ నాటి భయంకరమైన పరిస్థితులకు అద్దం పడుతోంది. - అక్షరదర్బార్, ప్రధానప్రతినిధి

02





- మహిళలతో బొగ్గు ఉత్పత్తికి సన్నాహాలు
- ఉద్యోగుల కొలువులకు ఎసరు పెట్టేందుకేనా?
- 3 వేల మంది మహిళ ఉద్యోగులకు ఇబ్బందులు తప్పవా?
- మౌనవ్రతంలో కార్మిక సంఘాలు

# గని పనికి మహిళలు ?

## సింగరేణి సంస్థ వివాదాస్పద నిర్ణయం

సింగరేణి యాజమాన్యం మరో వివాదాస్పద నిర్ణయం తీసుకుంది. బొగ్గు ఉత్పత్తి పెంపు పేరుతో ఏకంగా మహిళా ఉద్యోగుల భద్రతను పణంగా పెట్టేందుకు సిద్ధమైంది. అపాయకరమైన, కఠినమైన భూగర్భ గనుల్లో పనిచేసేందుకు 3 వేల మందికి పైగా మహిళా కార్మికులను పంపించే ప్రయత్నాలు చేస్తోంది. ఉద్యోగుల సంఖ్య తగ్గించుకుని వేతనాల భారం తగ్గించుకునేందుకు యాజమాన్యం పన్నిన కుట్రగా దీన్ని కార్మికులు భావిస్తున్నారు. యాజమాన్యం నిర్ణయాలపై కార్మిక సంఘాలు కూడా మౌనం వహించడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోంది. ఇది బ్రిటిష్ పాలకుల పాలనను గుర్తు చేస్తోందని కార్మికులు ఆందోళన చెందుతున్నారు. యాజమాన్యం తీసుకున్న నిర్ణయాలను వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. –అక్షర దర్బార్, హైదరాబాద్

04

## మహిళా సంఘాల ఉత్పత్తుల విక్రయానికి మార్ట్

- నగర మేయర్ గుండు సుధారాణి
- కమిషనర్ తో కలిసి కాశీబుగ్గ సర్కిల్ ఆఫీస్ వద్ద పరిశీలన

02



## 31లోగా సిద్ధం చేయాలి

- హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్
- జేఎన్ఎస్ లో తాత్కాలిక స్పోర్ట్స్ స్కూల్ ఏర్పాట్ల పరిశీలన

02



## సైబర్ నేరగాళ్ల వలలో ప్రభుత్వ ఉద్యోగి

రూ. 8.71 లక్షల దోపిడీ

05

# 31లోగా సిద్ధం చేయాలి

- హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్
- జేఎన్ఎస్ లో తాత్కాలిక స్పోర్ట్స్ స్కూల్ ఏర్పాట్ల పరిశీలన

అక్షరదర్బార్, హనుమకొండ: హనుమకొండలోని జవహర్ లాల్ నెహ్రూ స్టేడియంలో స్పోర్ట్స్ స్కూల్ కం సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీ తాత్కాలిక ప్రారంభానికి అవసరమైన సదుపాయాలను గురువారం కలెక్టర్ స్నేహ శబరీష్ క్షేత్రస్థాయిలో పర్యటించి పరిశీలించారు. ఈ సందర్భంగా స్టేడియం ఆవరణలో ఉన్న హాస్టల్ భవనాలు, అవుట్ డోర్, క్రీడా మైదానాలను పరిశీలించి వాటిలో చేపట్టాల్సిన మరమ్మత్తులు, కల్పించాల్సిన సదుపాయాలను, విద్యార్థులకు క్రీడా సదుపాయాలు ఈనెల 31వ తేదీలోగా ఏర్పాట్లు సిద్ధం చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా డీవైఎస్ఓ అశోక్ కుమార్ తో ప్రస్తుతం ఏర్పాటు చేసిన మౌలిక వసతుల గురించి చర్చించారు. జేఎన్ఎస్ స్టేడియం ఆవరణలో విద్యార్థులకు హాస్టల్ వసతిలో ఉండాల్సిన సదుపాయల కల్పనకు, ఇండోర్, అవుట్ డోర్ క్రీడా సదుపాయాలు, పరికరాల ఏర్పాటుకు, అవసరమైన మరమ్మత్తులకు వెంటనే పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్అండ్ బీ ఈఈ సురేష్, కోచ్ లు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.





# చరిత్రలో మాయని మచ్చ

## బైరాన్‌పల్లి మారణకాండ



- మరో జలియన్‌వాలా బాగ్ అది..
- 1948 ఆగస్టు 27న గ్రామంలో రజాకార్ల ఊచకోత
- సాయుధులై 1,200 మంది ప్రవేశం
- విచక్షణరహితంగా కాల్పులు.. 118 మంది దుర్మరణం
- మహిళలను వివస్త్రలను చేసి బతుకమ్మ ఆడించిన దారుణం
- ఘటనకు నిన్నటితో 77 ఏళ్ళు

**అక్షరదర్బార్, ప్రధానప్రతినిధి :**

1948, ఆగస్టు 27... ఆ రోజు బైరాన్‌పల్లి ప్రజలకు ఒక పీడకల. తెల్లవారుజామున 4 గంటల వేళ, సుమారు 1,200 మంది రజాకార్లు అకస్మాత్తుగా ఆ ప్రశాంతమైన ఊరిపై దాడికి దిగారు. తుపాకీ మోతలు, ఫిరంగుల శబ్దాలు... క్షణాల్లోనే పల్లె స్మశానాన్ని తలపించింది. ఈ ఊచకోతలో 96 మంది అమాయకులు ప్రాణాలు కోల్పోయారు. అయితే, ఆ మారణకాండలో అత్యంత హృదయ విదారకమైన అంశం.. అమరులైన యోధుల శవాల చుట్టూ, మహిళలను వివస్త్రలను చేసి బలవంతంగా బతుకమ్మ ఆడించడం. నిజాం పాలనలోని అమానవీయ కోణాన్ని, దొరల దురాగతాలను ఈ ఒక్క సంఘటన కళ్లకు కట్టింది. తమ ఆత్మగౌరవంపై జరిగిన ఈ దాడిని తట్టుకోలేక కొంతమంది మహిళలు ఆత్మహత్యలకు పాల్పడటం ఆ నాటి భయంకరమైన పరిస్థితులకు అద్దం పడుతోంది.

### - రజాకార్ల ఆగడాలు..

సిద్దిపేట జిల్లా దూళిమిట్ట మండలంలోని బైరాన్‌పల్లి కేవలం ఒక పల్లె కాదు. తెలంగాణ సాయుధ పోరాటంలో నిజాం నిరంకుశ పాలనకు, దేశ్‌ముఖ్‌ల దోపిడీలకు, రజాకార్ల అరాచకాలకు ఎదురు నిలిచి పోరాడిన వీరభూమి. 1947లో దేశానికి స్వాతంత్ర్యం వచ్చినా, నిజాం రాష్ట్రం ఆ చీకటి రోజుల్లోనే మగ్గిపోయింది. రజాకార్ల దౌర్జన్యాలను ఎదుర్కొనేందుకు గ్రామ రక్షణ దళాలు ఏర్పడ్డాయి. పొరుగు గ్రామాలను దోచుకుని బైరాన్‌పల్లి మీదుగా వెళ్తున్న రజాకార్లపై గ్రామస్తులు దాడిచేసి, వారిని భయపెట్టి పంపించారు. ఈ ఘర్షణలో 20 మంది రజాకార్లు మరణించడంతో, బైరాన్‌పల్లిపై కక్ష కట్టిన అప్పటి భువనగిరి డిప్యూటీ కలెక్టర్ హాసీం, ఆ గ్రామాన్ని 'తిరుగుబాటు గ్రామంగా' ప్రకటించాడు.

### - అమర వీరుల త్యాగం.. చరిత్రలో నిలిచేలా..

**ఈ మారణకాండ అనంతరం కూడా పోరాటం ఆగలేదు. తెలంగాణ సాయుధ పోరాటంలో బైరాన్ పల్లి ప్రజల భాగస్వామ్యం అమోఘం. ఈ వీరోచిత పోరాటాలు, త్యాగాలు ఇప్పటి పాఠ్యాంశాల్లో చేర్చాలని, అమరుల స్మారకంగా ఒక అమరధామం, లైబ్రరీ, కమ్యూనిటీ హాల్ నిర్మించాలని గ్రామస్థులు కోరుతున్నారు. 70 ఏళ్లు గడిచినా, నాటి పోరాటంలో పాల్గొన్న కుటుంబాలకు ఇప్పటికీ పెన్షన్లు లభించకపోవడం బాధాకరం. బైరాన్ పల్లి ఊచకోత.. రజాకార్ల ఆగడాలకు, నిజాం నిరంకుశత్వానికి వ్యతిరేకంగా పోరాడిన తెలంగాణ ప్రజల ధైర్యానికి, త్యాగానికి చిరస్మరణీయమైన చిహ్నం. భవిష్యత్ తరాలకు ఆ నాటి వీరోచిత చరిత్రను తెలియజేసేందుకు ఆ గ్రామాన్ని టూరిస్టు కేంద్రంగా అభివృద్ధి చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.**

### - దారుణమైన క్రూరత్వం

బైరాన్‌పల్లిపై మరోసారి దాడి జరగబోతోందని హెచ్చరించడానికి వెళ్లిన గ్రామ కాపరి విశ్వనాథ్ భట్ జోషి రజాకార్లకు దొరికిపోవడంతో గ్రామానికి సమాచారం అందలేదు. దీంతో గ్రామస్తులు అప్రమత్తం కాలేకపోయారు. తెల్లవారుజామున ఊళ్లోకి ప్రవేశించిన రజాకార్లు, దొరికినవారిని దొరికినట్లుగా కాల్చి చంపారు. ఇంటింటికీ తిరిగి 96 మందిని వరుసగా నిలబెట్టి కాల్చి చంపడం పంజాబ్‌లో సంభవించిన జలియన్‌వాలాబాగ్ ఘటనను గుర్తుకు తెస్తుంది. ఈ మారణకాండలో మొత్తం 119 మంది యోధులు నేలకొరిగారని రికార్డుల్లో ఉన్నా, ఆ సంఖ్య 150కి పైగానే ఉంటుందని నాటి ప్రజలు చెబుతున్నారు. ఈ ఊచకోత బట్టి నాటి నిరంకుశ పాలన, మత ద్వేషం ఏ విధంగా సామాన్య ప్రజల జీవితాలను ఛిద్రం చేశాయో తెలియజేస్తుంది. ఈ ఘటన తెలంగాణ సాయుధ పోరాటంలో ఒక చీకటి అధ్యాయంగా మిగిలిపోయింది.



# మహిళా సంఘాల ఉత్పత్తుల విక్రయానికి మార్ట్

- నగర మేయర్ గుండు సుధారాణి
- కమిషనర్ తో కలిసి కాశీబుగ్గ సర్కిల్ ఆఫీస్ వద్ద పరిశీలన

అక్షరదర్బార్, వరంగల్: మహిళా మార్ట్ ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని నగర మేయర్ గుండు సుధారాణి అన్నారు. గురువారం కాశీబుగ్గ సర్కిల్ ఆఫీస్ వద్ద కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ తో కలిసి మహిళా సంఘాల ఉత్పత్తుల విక్రయానికి మార్ట్ ఏర్పాటు కోసం క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కోటి మంది మహిళలకు కొటీశ్వరులు చేయాలనే దృఢ సంకల్పంతో మహిళలకు ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని, అందులో భాగంగా స్వయం సహాయక మహిళ సంఘాల వారి వివిధ రకాల ఉత్పత్తులను ప్రోత్సహించుటకు గాను మహిళ మార్ట్ ను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. వరంగల్ పరిధికి సంబంధించి కాశీబుగ్గ సర్కిల్ కార్యాలయంలో గ్రౌండ్ ఫ్లోర్ లో గల 5 గదులను పునరుద్ధరించి, నవీకరించి మహిళ మార్ట్ త్వరితగతిన ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జి సిటీ ప్లానర్ రవీందర్ రాడేకర్, ఏసీపీలు ఖలీల్, ప్రశాంత్, ఇంచార్జి ఈఈ సంతోష్ బాబు, సూపరింటెంట్ హబీబ్, ఆర్ ఓ షెహజాది బేగం, టీపీఎస్ లు అనిల్, శ్రీకాంత్, ఏఈ హబీబ్ తదితరులు పాల్గొన్నారు.



# నిమజ్జన ప్రదేశాలను పరిశీలించిన సీపీ

అక్షరదర్బార్, హనుమకొండ: వచ్చే నెల 5న ట్రై సిటీ పరిధిలో జరిగే గణేష్ నిమజ్జనం జరగనున్న దృష్ట్య ట్రై సిటీలో గణేష్ ప్రతిమల నిమజ్జనం జరిగే కాజీపేటలోని బంధం చెరువు, హనుమకొండలోని సిద్దేశ్వర గుండం, హసన్ పర్తి చెరువును వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ సెంట్రల్ జోన్ డీసీపీ షేక్ సలీమా, అదనపు డీసీపీ ప్రభాకర్ రావు, స్పెషల్ బ్రాంచ్ ట్రాఫిక్ ఏసీపీలు జితేందర్ రెడ్డి, సత్యనారాయణ, ఇన్ స్పెక్టర్లు సుధాకర్ రెడ్డి, వెంకన్న, స్థానిక పోలీస్ అధికారులతో కలిసి గురువారం పరిశీంచారు. నిమజ్జన కార్యక్రమం నిర్వహణకు చేయాల్సిన ఏర్పాట్లపై క్షేత్ర స్థాయిలో సీపీ సంబంధిత అధికారులతో సమీక్ష చేశారు. ముఖ్యంగా నిమజ్జనం జరిగే ప్రాంతంలో ఏర్పాటు చేయాల్సిన క్రేన్లు, సిబ్బంది నియామకం, విద్యుత్తు ఏర్పాట్లు, బారికేడ్ల నిర్మాణం, తెప్పల ఏర్పాటుపై సీపీ అధికారులతో చర్చించారు.

# చెత్తాచెదారంతో దుర్వాసన

- శాయంపేట బస్టాండ్ లో దుర్గంధం
- ప్రయాణికుల ఇబ్బందులు

అక్షర దర్బార్, శాయంపేట : మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణంలో మరుగుదొడ్లు సరిగా పనిచేయకపోవడంతో ప్రజలు బహిరంగ మలమూత్ర విసర్జన చేస్తున్నారు. చెత్తాచెదారం పేరుకుపోవడంతో దుర్వాసన వ్యాప్తి చెందుతూ సంతకు వచ్చే ప్రజలకు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయని బహుజన సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు మొగ్గం సుమన్ వాపోయారు. వర్షాల కారణంగా పరిస్థితి మరింత దారుణంగా మారిందని, అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.



# ఎమ్మెల్యే రేవూరి నివాళి

అక్షర దర్బార్, పరకాల : కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, మాజీ పిఏసి ఎస్ చైర్మన్ పూజారి సాంబయ్య అనారోగ్యంతో గురువారం మృతి చెందారు. ఆయన పార్థివదేహానికి ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి పూల మాలలు వేసి నివాళులర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శిం చారు. సాంబయ్య నిజాయితీ, క్రమశిక్షణ, నిబద్ధతకు ప్రతీకగా నిలిచారని, ఆయన మృతి కాంగ్రెస్ పార్టీకి తీరని లోటు అని ఎమ్మెల్యే తెలిపారు.





# హైదరాబాద్ కి బీచ్



## - రూ.225 కోట్లతో కృత్రిమంగా ఏర్పాటు

అక్షరదర్బార్, హైదరాబాద్: పర్యాటకులను ఆకర్షించే అద్భుతమైన చారిత్రక కట్టడాలు, సంస్కృతికి హైదరా బాద్ ప్రసిద్ధి చెందింది. అయితే, సముద్ర తీరం లేక పోవడంతో బీచ్ అనుభూతిని పొందాలంటే నగరవా సులు సుదూర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోంది. ఇకపై ఆ అవసరం లేదు. ముత్యాల నగరానికి త్వరలో కృత్రిమ బీచ్ అందాలు తోడవ్వబోతున్నాయి. కొత్వాల్‌గూడలో భారీ ప్రాజెక్టు అందుబాటులోకి రానుంది. హైదరాబాద్‌కు సమీపంలోని కొత్వాల్‌గూడ వద్ద 35 ఎకరాల విస్తీర్ణంలో ఈ భారీ ప్రాజెక్టును చేపట్టేందుకు తెలంగాణ ప్రభుత్వం సిద్ధమైంది. దీనికి సంబంధించిన ప్రణాళికలను కూడా ఇప్పటికే ఖరారు చేసింది. దాదాపు రూ.225 కోట్ల అంచనా వ్యయంతో ప్రభుత్వ– ప్రైవేట్ భాగస్వామ్యం పద్ధతిలో దీన్ని నిర్మించనున్నారు. ఈ ప్రాజెక్టు డిసెంబర్ నుంచి ప్రారంభమయ్యే అవకా శాలు ఉన్నట్లు తెలుస్తోంది.

## - ప్రపంచస్థాయి పర్యాటక కేంద్రంగా...

ఈ కృత్రిమ బీచ్‌ను నిజమైన బీచ్‌కు ఏమాత్రం తగ్గకుండా రూపొందించనున్నారు. ఇక్కడ సందర్శ కుల కోసం అనేక ఆకర్షణీయమైన ఏర్పాట్లు చేయబో తున్నారు. జల విలాసాలు... ఈ ప్రాజెక్టులో ముఖ్యంగా ఆకట్టుకునే అంశం నీటిపై తేలియాడే విల్లాలు. వీటితో పాటు హోటళ్లు, రెస్టారెంట్లు కూడా ఏర్పాటు చేస్తారు. సాహస క్రీడలు... థ్రిల్ కోరుకునే వారి కోసం బంగీ జంపింగ్, స్కేటింగ్, సెయిలింగ్ వంటి సాహస క్రీడలు అందుబాటులో ఉంటాయి. వీటికి తోడు ప్రత్యేకంగా వింటర్ స్పోర్ట్స్‌కు కూడా ఏర్పాట్లు చేస్తున్నారు.

## - కుటుంబ వినోదం...

కుటుంబంతో కలిసి ఆనందించేందుకు వీలుగా పార్కులు, పిల్లల ఆట స్థలాలు, సైక్లింగ్ జోన్‌లు, జాగింగ్ ట్రాక్‌లు ఉంటాయి. అదనపు ఆకర్షణలు.. ఫుడ్ కోర్టులు, థియేటర్లు, అలంకార ఫౌంటెన్లు, వేవ్ పూల్స్ వంటి విశ్రాంతి స్థలాలు సందర్శకులను కట్టిప డేస్తాయి. అన్ని రకాల సదుపాయాలతో ఇది కేవలం ఒక బీచ్‌గా కాకుండా, ఒక సంపూర్ణ వినోద కేంద్రంగా మారబోతోంది. ఔటర్ రింగ్ రోడ్‌కు సమీపంలో ఉండటంతో నగరంలో ఎక్కడి నుంచైనా సులభంగా చేరుకునే అవకాశం ఉంది. ఈ ప్రాజెక్టు పూర్తయితే హైదరాబాద్ పర్యాటక రంగంలో కొత్త అధ్యాయం మొదలవుతుందని ప్రభుత్వం ఆశాభావం వ్యక్తం చేస్తోంది.

# పరకాల కోర్టు అదనపు న్యాయమూర్తిగా శైలజ



అక్షర దర్బార్, పరకాల: పరకాల కోర్టు అదనపు న్యాయమూర్తిగా శ్రీవల్లి శైలజ గురువారం బాధ్యతలు చేపట్టారు. పరకాల, నడికూడ, దామెర మండలాలతో కలిపి గత నాలుగు సంవత్సరాల క్రితం అదనపు కోర్టు ఏర్పడడం జరిగింది. అప్పటినుండి అదనపు న్యాయమూర్తి నియామకం కాలేదు. గురువారం అదనపు న్యాయమూ ర్తిగా శైలజ బాధ్యతలు స్వీకరించడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు. వారిని ప్రధాన న్యాయమూర్తి సాయి శరత్, బార్ అసోసియేషన్ అధ్యక్షులు పెండ్యాల భద్రయ్య ఘనంగా సన్మానించడం జరిగింది. ఈ కార్యక్ర మంలో సీనియర్ న్యాయవాదులు పున్నం రాజిరెడ్డి, ఒంటేరు రాజమౌళి, ఏ జి పి మెరుగు శ్రీనివాస్, బార్ కార్యదర్శి శ్రావణ్ కుమార్, ఉపాధ్యక్షులు కూకట్ల శ్రీనివాస్, చంద్రమౌళి, పరమేశ్వర్, సాబీర్, రాహుల్, విక్రమ్, చంద్రమోహన్, రాజు, సురేష్, రమేష్, రవి కుమార్, లక్కం శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలపై భారం మోపే కేంద్ర విద్యుత్ చట్టం

**–ఎంసీపీఐ(యూ) జిల్లా కార్యదర్శి రమేష్**

అక్షర దర్బార్, నర్సంపేట : విద్యుత్ రంగాన్ని ప్రైవేటీకరించి కార్పొరేట్ శక్తులకు లబ్ధి చేకూర్చేందుకే మోడీ ప్రభుత్వం విద్యుత్ సవరణ చట్టాన్ని తెచ్చిందని ఎంసిపిఐ(యు) జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేష్ ఆందోళన వ్యక్తం చేశారు. గురువారం నర్సంపే టలో విద్యుత్ పోరాట అమరవీరుల 25వ వర్ధంతి సందర్భంగా ఆయన మాట్లాడారు. స్మార్ట్ మీటర్ల పేరుతో ప్రజలపై అదనపు భారం మోపేందుకు కేంద్రం ప్రయత్నిస్తోందని రమేష్ విమర్శించారు. ఇప్పటికే రైతు సంఘాలు ఈ చట్టానికి వ్యతిరేకంగా ఆందోళనలు చేస్తున్నప్పటికీ కేంద్రం స్పందించడం లేదని ఆయన అన్నారు.ఉమ్మడి రాష్ట్రంలో విద్యుత్ పోరాటంలో ప్రాణాలు అర్పించిన అమరవీరులను గుర్తుచేసుకున్న ఆయన, అప్పటి ప్రజా పోరాటాల వల్లే ప్రభుత్వాలు వెనక్కి తగ్గాయని పేర్కొన్నారు. అదే గుణపాఠం ప్రస్తుత పాలకులు నేర్చుకోవాలని, కేంద్రం తీసుకువచ్చిన నూతన విద్యుత్ చట్టాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్ర మంలో పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు కుసుంబ బాబూరావు, వంగాల రాధసుధ, జిల్లా, డివిజన్ నేతలు తదితరులు పాల్గొన్నారు.



# జీజీఈఏ కన్వీనర్ గా వెంకటేశ్వర్లు

అక్షరదర్బార్, భూపాలపల్లి: భూపాలపల్లిలోని సంఘమిత్ర డిగ్రీ, పీజీ కళాశాలలో బుధవారం జిల్లా గౌడ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం (జీజీఈఏ) భూపా లపల్లి తొలి సమావేశం జరిగింది. జిల్లాలోని వివిధ ప్రభుత్వ విభాగాల్లో సేవలందిస్తున్న గౌడ కులానికి చెందిన ఉద్యోగులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గౌడ కమ్యూనిటీ ఐక్యత, అభివృద్ధి, యువత ప్రోత్సాహం, సాంస్కృతిక వారసత్వ పరిరక్షణ దిశగా పలు కీలక తీర్మానాలు ఆమోదించారు.




## - అడ్ హాక్ కమిటీ

అడ్ హాక్ కమిటీ కన్వీనర్ గా బత్తిని వెంకటేశ్వర్లు గౌడ్, కో–కన్వీనర్ గా చిర్ర రఘు గౌడ్, సభ్యులుగా దాసరి చంద్రమౌళి గౌడ్, వేముల సదానందం గౌడ్, తోట సురేష్ గౌడ్, కాసగాని తిరుపతి గౌడ్, మూల తిరుపతి గౌడ్, ఉమ్మగాని క్రాంతి గౌడ్, గండి రాజ్ కుమార్ గౌడ్, ముక్కెర ధనుంజయ్ గౌడ్, పెసరు నాగరాజు గౌడ్, గుర్రం రాజు గౌడ్, ముక్కెర హేమంత్ గౌడ్, బాలవేని రాంబాబు గౌడ్, అంబటి దేవేందర్ గౌడ్, గట్టు కపిల్ గౌడ్ నియామకం అయ్యారు. ఈ కమిటీ తాత్కాలికంగా పని చేస్తూ, రాబోయే సమావేశంలో శాశ్వత కమిటీని ఎన్నుకో నుంది. భూపాలపల్లి పరిసర ప్రాంతాల నుండి అనేక మంది గౌడ ప్రభుత్వ ఉద్యోగులు హాజరై సంఘం ప్రారంభానికి మద్దతు తెలిపారు. యువతకు ప్రేరణ కలిగించేలా సన్మాన కార్యక్రమాలు, సాంస్కృతిక వారసత్వాన్ని గుర్తు చేసేలా పాపన్న జయంతి వేడుకలు నిర్వహించాలని నిర్ణయించారు. ఈ సందర్భంగా కన్వీనర్ బత్తిని వెంకటేశ్వర్లు గౌడ్ మాట్లాడుతూ, “మన గౌడ కమ్యూనిటీలో ఉన్న ప్రతిభను వెలికి తీసి, భవిష్యత్ తరాలకు మార్గదర్శ కంగా నిలిచేలా జీజీఈఏ పనిచేస్తుందని అన్నారు.



## ప్రధాన రహదారి సమస్యపై అఖిలపక్ష సమావేశం

అక్షర దర్బార్, వెంకటాపురం : మండల ప్రధాన రహదారి సమస్యల పరిష్కారంపై గురువారం ఆర్ & బి గెస్ట్ హౌస్ లో అఖిలపక్ష సమావేశం జరిగింది. ఈనెల 30న ఎమ్మెల్యేతో చర్చలు జరగనున్నాయని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సయ్యద్ హుస్సేన్ తెలిపారు. సమస్యల పరిష్కారానికి మెమొరాండాలు అందజేస్తామని, ప్రభుత్వం స్పందనపై తదుపరి కార్యాచరణ ఉంటుందని నాయకులు పేర్కొన్నారు. మండల ప్రజల సహకారంతో పోరాటం కొనసాగిస్తామని సిపిఐ మండల కార్యదర్శి గ్యానం వాసు తెలిపారు. సమావేశంలో బిఆర్ఎస్, టిడిపి, సిపిఎం నాయకులు, మార్కెట్ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



## ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తే చర్యలు తప్పవు

### డీజే నిర్వాహకులకు కౌన్సిలింగ్ ఇచ్చిన ఎస్సై అశోక్

అక్షర దర్బార్, పరకాల: వినాయక చవితి ఉత్సవాల సందర్భంగా డీజే నిర్వాహకులకు కౌన్సిలింగ్ ఇచ్చిన దామెర ఎస్సై కొంకా అశోక్. గురువారం దామెర మండలంలోని డిజే నిర్వాహకులను పిలిచి మండపాల వద్ద, వినాయక నిమజ్జన ఊరేగింపులలో డీజే ను పెట్టొద్దని, ప్రజలకు, భక్తులకు ఇబ్బంది కలిగే విధంగా డీజే నిర్వాహకులు వ్యవహరిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మండలంలో ఉన్న 14 మంది డీజే నిర్వాహకులను బైండోవర్ చేయడం జరిగిందని ఎస్సై కొంకా అశోక్ తెలిపారు.



## దుగ్గొండి ఎస్ఐని కలిసిన ఐఎన్టీయూసీ ఆటో కార్మిక సంఘం నేతలు

అక్షర దర్బార్, దుగ్గొండి : ఇటీవల నూతనంగా ఏర్పడిన కాంగ్రెస్ అనుబంధ ఐఎన్టీయూసీ ఆటో కార్మిక సంఘం సభ్యులు గురువారం ఎస్ఐ రావుల రణధీర్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎస్ఐకి పూల బొకే అందించి శాలువాతో సత్కరించారు. ఆటో డ్రైవర్లు రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని ఎస్ఐ సూచించారు. కార్యక్రమంలో ఐఎన్టియుసి నాయకులు, ఆటో యూనియన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

## క్యారం బోర్డుల పంపిణీ

అక్షరదర్బార్, హనుమకొండ: కాంగ్రెస్ పార్టీ హనుమకొండ జిల్లా సోషల్ మీడియా ఆధ్వర్యంలో నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని వినాయక మండపాలకు డివిజన్ కు రెండు చొప్పున క్యారం బోర్డ్ లను వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి గురువారం పంపిణీ చేశారు. సామాజిక మాధ్యమాల్లో ప్రభుత్వ పథకాలు ప్రచారం చేస్తూ ప్రజలకు విషయ పరిజ్ఞానంలో చేరువచేస్తూ, సామాజిక సేవ కార్యక్రమాలు చేపట్టడం చాలా సంతోషమని ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని అభినందించారు. వినాయక మండపాల్లో భక్తిభావంతో పాటు, అడవిడుపు కోసం ఈ కార్యక్రమం దోహదపడుతుందని అన్నారు. గణపతి నవరాత్రి ఉత్సవాల్లో ఎటువంటి ఆటంకాలు తలెత్తకుండా చూడాలని, విద్యుత్తు పట్ల అప్రమత్తంగా ఉండాలని కోరారు.







# గని పనికి మహిళలు?

- సింగరేణి సంస్థ వివాదాస్పద నిర్ణయం
- మహిళలతో బొగ్గు ఉత్పత్తికీ సన్నాహాలు
- 3 వేల మంది మహిళ ఉద్యోగులకు ఇబ్బందులు తప్పవా?
- ఉద్యోగుల కొలువులకు ఎసరు పెట్టేందుకేనా?
- మౌనవ్రతంలో కార్మిక సంఘాలు

**అక్షరదర్బార్, ప్రధానప్రతినిధి :**

సింగరేణిలో మహిళా కార్మికులను భూగర్భ గనుల్లోకి పంపించేందుకు యాజమాన్యం చేస్తున్న ప్రయత్నాలు తీవ్ర ఆందోళనలకు దారితీస్తున్నాయి. ఈ నిర్ణయం మహిళల భవిష్యత్తుపై, భద్రతపై తీవ్ర ప్రభావం చూపుతుందని కార్మిక సంఘాలు, కార్మికులు భయపడుతున్నారు. యాజమాన్యం నిర్లక్ష్యం, కార్మిక సంఘాల మౌనం ఈ పరిస్థితిని మరింత క్లిష్టంగా మారుస్తున్నాయి. సింగరేణి యాజమాన్యం తీసుకుంటున్న ఈ నిర్ణయం మహిళల జీవితాలపై తీవ్ర ప్రభావం చూపుతుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. సింగరేణిలో కార్మికులు 42 వేలు కాగా ఇందులో మూడు వేలలోపు మంది మహిళా కార్మికులు ఉంటారు. బొగ్గు గనుల్లో పనిచేయడం శారీరకంగా, మానసికంగా ఎంతో కష్టమైన పని. భూగర్భ గనుల్లోని పని చాలా ప్రమాదకరమైనది. ఇక్కడ గ్యాస్ లీకేజీలు, పైకప్పు కూలడం, నీరు చేరడం వంటి ప్రమాదాలు నిత్యం జరుగుతూ ఉంటాయి. ఈ పరిస్థితుల్లో పురుష కార్మికులే ఎన్నో కష్టాలు పడుతుండగా, మహిళల భద్రత ఒక పెద్ద ప్రశ్నగా మిగిలిపోయింది. గనుల్లో ఉండే దుమ్ము, ధూళి, కాలుష్యం ఊపిరితిత్తుల సమస్యలకు దారితీస్తాయి, ఇది మహిళల ఆరోగ్యానికి మరింత హానికరం. దీనికి తోడు నిరంతర ప్రమాద భయం వారిని తీవ్రమైన మానసిక ఒత్తిడికి గురి చేస్తుంది. పురుషులతో కలిసి భూగర్భ గనుల్లో పనిచేయాల్సి వస్తే, లైంగిక వేధింపులు, భద్రతా లోపాలు ఎదురయ్యే ప్రమాదం ఉంది. ఈ సమస్యలను పరిష్కరించడానికి యాజమాన్యం ఎలాంటి చర్యలు తీసుకుంటుందో స్పష్టంగా తెలియదు. కుటుంబ బాధ్యతలతో సతమతమవుతున్న మహిళలు, ఈ కఠినమైన పనిని తట్టుకోగలరా అనేది అనుమానమే. పనిభారం పెరిగితే, చాలామంది మహిళలు ఉద్యోగాలను కోల్పోయే ప్రమాదం ఉంది.

### - యాజమాన్యం నిర్లక్ష్యం ..

కార్మికుల సంఖ్యను తగ్గించుకోవడానికే యాజమాన్యం ఈ నిర్ణయం తీసుకుందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. మహిళలు ఈ కష్టమైన పనిని తట్టుకోలేక ఉద్యోగాలను వదిలేస్తారని, తద్వారా సింగరేణికి జీతాల భారం తగ్గుతుందని యాజమాన్యం ఆశ పడుతోందని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇది కార్మికుల సంక్షేమాన్ని పణంగా పెట్టి, లాభాలను పెంచుకోవాలనే యాజమాన్యం స్వార్థపూరిత వైఖరికి నిదర్శనమంటున్నారు. సింగరేణిలో గుర్తింపు పొందిన కార్మిక సంఘాలు ఈ అంశంపై నోరు మెదపకపోవడంపై కార్మికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మహిళల భద్రతకు సంబంధించిన కీలకమైన విషయంపై కూడా అవి మౌనం వహించడం వెనుక యాజమాన్యంతో ఉన్న అంతర్గత ఒప్పందాలు కారణం కావచ్చునని కార్మికులు అనుమానిస్తున్నారు. కార్మికుల హక్కులను కాపాడాల్సిన సంఘాలే వారికి ద్రోహం చేస్తున్నాయనే భావన బలపడుతోంది. యాజమాన్యం ఏ నిర్ణయం తీసుకున్నా, కార్మిక సంఘాలు 'తందాన' అన్నట్లుగా వ్యవహరిస్తున్నాయని విమర్శలు వస్తున్నాయి.

### - కార్మిక సంఘాల ఆగ్రహం..

సంస్థ నిర్ణయాలను కార్మిక సంఘాలు, కార్మికులు బ్రిటిష్ పాలకుల పాలనతో పోలుస్తున్నారు. అప్పట్లో తెల్ల దొరలు కార్మికులను నిర్బంధంగా బొగ్గు గనుల్లోకి దించేవారని, ఇప్పుడు మన అధికారులు రూపంలో అదే పద్ధతి మళ్లీ వస్తోందని ఆరోపిస్తున్నారు. మహిళా కార్మికులకు ఉద్యోగాలకు ఉద్వాసన పలికేందుకే యాజమాన్యం ఇలాంటి నిర్ణయాలు తీసుకుంటుందని కార్మిక సంఘాలు ఆరోపిస్తున్నాయి. పని ఒత్తిడిని తట్టుకోలేక మహిళలు ఉద్యోగాలను కోల్పోతే, వారి కుటుంబాలు రోడ్డున పడతాయని భయం వ్యక్తమవుతోంది. కార్మిక సంఘాల మద్దతుతోనే యాజమాన్యం ఈ సాహసోపేతమైన నిర్ణయం తీసుకుందని, అందుకే అవి ఈ విషయంలో మౌనంగా ఉన్నాయని కొందరు ఆరోపిస్తున్నారు. పరిస్థితి ఇలాగే కొనసాగితే, కార్మికుల జీవితాలు అల్లకల్లోలమవుతాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కార్మికులు తమ ప్రాణాలను ఫణంగా పెట్టి పనిచేస్తున్నారని, వారి హక్కులను కాలరాస్తున్నారని ఆరోపిస్తున్నారు. యాజమాన్యం తీసుకున్న నిర్ణయాలను వెంటనే వెనక్కి తీసుకోవాలని, కార్మిక సంఘాలు తమ మౌనాన్ని వీడి కార్మికులకు మద్దతుగా నిలబడాలని డిమాండ్స్ పెరుగుతున్నాయి.

## వాగు వరద ఉధృతిని పరిశీలించిన ఎమ్మెల్యే

అక్షరదర్బార్, భూపాలపల్లి:జిల్లాలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు భూపాలపల్లి మండలం మొరంచపల్లి గ్రామ శివారులోని మొరంచపల్లి వాగు వరద నీటితో ఉధృతంగా ప్రవహిస్తోంది. కాగా గురువారం భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు స్థానిక నేతలతో కలిసి వాగు వరద ఉధృతిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... వాగులు, వంకలు వరద నీటితో పొంగిపొర్లడంతో నియోజకవర్గంలోని ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆయా శాఖల అధికారులను తక్షణ చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో పరిస్థితులను అంచనా వేసి, ప్రజల భద్రతకు ప్రాధాన్యతనిస్తూ అవసరమైన సహాయ చర్యలను చేపట్టాలని ఆదేశించారు. వరదల కారణంగా ఎవరికీ ఇబ్బంది కలగకుండా, ఎక్కడైనా ప్రమాద పరిస్థితులు ఏర్పడితే అక్కడ వెంటనే స్పందించేందుకు తగిన ఏర్పాట్లు చేసుకోవాలని కోరారు.



# సర్వేయర్ల వల్లే 1/70 చట్టానికి తూట్లు

## ఆదివాసి సంక్షేమ పరిషత్ ములుగు జిల్లా కన్వీనర్ పర్శిక సతీష్

అక్షర దర్బార్, (నూగూరు) వెంకటాపురం : షెడ్యూల్డ్ ప్రాంతాల్లో అమలవుతున్న 1/70 చట్టానికి సర్వేయర్ల తప్పుడు రిపోర్టుల వల్లే తూట్లు పొడుస్తున్నాయని ఆదివాసి సంక్షేమ పరిషత్ ములుగు జిల్లా కన్వీనర్ పర్శిక సతీష్ ఆరోపించారు. ములుగు జిల్లా వెంకటాపురం మండలంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆదివాసి సంక్షేమ పరిషత్ ఆధ్వర్యంలో ఆదివాసుల తరపున మెమోరాండం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజ్యాంగంలోని ఆర్టికల్ 244(1) కింద ఐదవ షెడ్యూల్ ప్రాంతాల్లో గిరిజనులకు ప్రత్యేక హక్కులు ఉన్నప్పటికీ అధికారులు వాటిని నిర్లక్ష్యం చేస్తున్నారని విమర్శించారు. గిరిజనులు సాగులో ఉన్న భూములకు పట్టాలు ఇవ్వకుండా అసైన్మెంట్ పేరుతో కాలయాపన చేస్తున్నారని, మరోవైపు వలస గిరిజనేత రులు ధరణి ద్వారా ప్రభుత్వ భూములను అక్రమంగా పట్టాలు పొందుతున్నారని ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంకటాపురం మండలంలోని అంకన్నగూడెం, వీరభద్రవరం, సూరవీడు, చిన్నడ, నూగురు, మరికాల, బోదాపురం గ్రామాల్లో ప్రభుత్వ భూములను గిరిజనేతరుల పేర్లకు ఎంట్రీలు చేయడం సర్వేయర్ల ద్వారానే జరి గిందని అన్నారు. భూభారతి (ఆర్.ఓ.ఆర్) చట్టం – 2025లో షెడ్యూల్డ్ ప్రాంత చట్టాలకు వ్యతిరేకంగా 1970 తర్వాత గిరిజనేతరుల పేర్లకు వచ్చిన అన్ని అక్రమ పట్టాలను సమీక్షించి, తప్పుడు రిపోర్టులు ఇచ్చిన సర్వేయర్లపై చర్యలు తీసుకోవాలని, అలాగే ఎల్.టి.ఆర్ కేసులు నమోదు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్ర మంలో మండల ఉపాధ్యక్షులు తాటి రాంబాబు, కార్యదర్శి కుర్సం శంకర్, బొగ్గుల రాజ్‌కుమార్, తాటి నాగరాజ్, పూనెం అర్జున్, సోడి మనోజ్ తదితరులు పాల్గొన్నారు.







విద్యార్థులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు



లబ్ధిదారులకు చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే గండ్ర

# విద్యార్థుల భవిష్యత్తుకు ప్రభుత్వం కృషి

## –ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు

అక్షర దర్బార్, భూపాలపల్లి : భూపాలపల్లి మంజూరునగర్ ప్రభుత్వ మైనారిటీ రెసిడెన్షియల్ పాఠశాలను గురువారం ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు ఆక స్మికంగా తనిఖీ చేశారు. వంటగదిలో విద్యార్థులకు అందించే భోజనాన్ని రుచి చూసి, తరగతి గదులు, వసతి గృహాలు, డ్రైనేజీ సమస్యలను పరిశీలించారు.ఈ సందర్భంగా విద్యార్థులు తరగతి గదులకు బెంచీలు, కిటికీలు, సీసీ రోడ్లు, బాత్రూములు, పాములు రావడం వంటి సమస్యలను ఎమ్మెల్యేకు విన్నవించారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే సంబంధిత అధికారులను తక్షణ చర్యలు తీసుకో వాలని ఆదేశించారు.సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం విద్యార్థుల బంగారు భవిష్యత్తు కోసం కృషి చేస్తోందని, వసతి గృహాల్లో నాణ్యమైన భోజనం, విద్య అందించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని ఎమ్మెల్యే తెలిపారు. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు.

### కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ

అక్షర దర్బార్, మొగుళ్లపల్లి : మండలానికి చెందిన 50 మంది లబ్ధిదారులకు గురువారం కల్యాణలక్ష్మి చెక్కులను ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో బడుగు బలహీన వర్గాల కోసం సంక్షేమ పథకాలు అమలు అవుతున్నాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు.కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మహ్మద్ రఫీ, పిఎసి ఎస్ చైర్మన్ సంపెల్లి నరసింగరావు తదితరులు పాల్గొన్నారు.

# రెసిడెన్షియల్ స్కూల్లో ఎంపీ, ఎమ్మెల్యే తనిఖీ

అక్షరదర్బార్, వరంగల్ : ఖిలా వరంగల్ మండలం జక్కలొద్దిలోని మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాల, కళాశాలను వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్యశారద గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు.వారు



ముందుగా విద్యార్థుల హాజరు, తరగతుల నిర్వహణను పరిశీలిం చారు. అనంతరం వంటశాల, స్టోర్ రూం, హాస్టల్ గదులు, టాయిలెట్స్‌ను పరిశీలించి పరిశుభ్రతపై సూచనలు చేశారు. మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందుతున్నదా అని పరిశీలించి విద్యా ర్థులతో కలిసి భోజనం చేశారు.విద్యార్థుల చదువు, ఆరోగ్యం, మౌలిక సదుపాయాలపై సమాచారం తెలుసుకుని, వారికి అవసరమైన విష యాలను అడిగి తెలుసుకున్నారు. భవిష్యత్తు లక్ష్యాలపై విద్యార్థులతో చర్చిస్తూ, వ్యక్తిత్వ వికాసం, క్రీడల్లో రాణించాలనే ప్రోత్సాహక వచనాలు చెప్పారు. ఇంటర్మీడియట్ చదువు భవిష్యత్ దిశను నిర్ణయి స్తుందని, ఒత్తిడికి లోనుకాకుండా కష్టపడి చదవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి రమేష్, నీటిపారుదల శాఖ ఈఈ శంకర్, డీఈ మధుసూదన్, తహసీ ల్దార్ నాగేశ్వరరావు, కళాశాల ప్రిన్సిపల్ బిక్షపతి, రెవెన్యూ అధికా రులు తదితరులు పాల్గొన్నారు.

# సైబర్ నేరగాళ్ల వలలో ప్రభుత్వ ఉద్యోగి

## - రూ. 8.71 లక్షల దోపిడీ



అక్షరదర్బార్, మహబూబాబాద్: మీ క్రెడిట్ కార్డు నంబర్ అని చెప్పి, కార్డు క్రెడిట్ విలువ రూ.1.60 లక్షలు ప్రస్తుతం ఉందని, దాన్ని మరింత పెంచుతామని, తన వద్ద ఉన్న క్రెడిట్ కార్డు వివరాలు నమ్మశక్యంగా చెప్పడంతో ఫోన్ చేసిన వ్యక్తి బ్యాంకు ఉద్యోగి అని నమ్మి, సైబర్ నేరగాడి వలలో పడి ఇతర బ్యాంకుల వివరాలు చెప్పడంతో రూ.8.71 లక్షలు పోగొట్టుకున్న ఓ ప్రభుత్వ ఉద్యోగి ఉదంతం ఇది. మహబూబాబాద్ జిల్లా కురవి మండల కేంద్రంలోని శ్రీ వీరభద్ర స్వామి దేవాలయంలో సీనియర్ అసిస్టెంట్ గా విధులు నిర్వహిస్తున్న కట్టా జగన్నాథం సెల్ ఫోన్ కు ఈనెల 26న మధ్యాహ్నం ఓ వ్యక్తి ఫోన్ చేసి, నీవద్ద ఉన్న బ్యాంకు క్రెడిట్ కార్డు విలువ తక్కువగా ఉందని దాన్ని పెంచుతామని వివరాలు చెప్పండని కోరాడు. ఇది నమ్మిన జగన్నాథం తన క్రెడిట్ కార్డు వివరాలు అవతలి వ్యక్తికి వెల్లడించాడు. తర్వాత క్రెడిట్ కార్డు యాప్ ద్వారా సరి చూసుకోమని చెప్పడంతో తన వద్ద ఆ బ్యాంకు యాప్ లింకు లేదని చెప్పడం జరిగింది. నేను నీకు బ్యాంకు యాప్ లింకు పంపిస్తున్నాను ఓపెన్ చేసి వివరాలు నమోదు చేయమని చెప్పడంతో సరే అన్నాడు. అనంతరం అవతలి వ్యక్తి నుంచి బ్యాంకు లోగో తో కూడిన లింకు రావడంతో నిజమని నమ్మిన జగన్నాథం ఆ యాప్ ఓపెన్ చేసి వివరా లను నమోదు చేశాడు. తర్వాత తన క్రెడిట్ లిమిట్ 6,89,000 రూపాయలకు పెరిగిందని చూపడంతో నిజమే నని నమ్మాడు. అలాగే నీకు మరేమైనా బ్యాంకులకు సంబం ధించిన క్రెడిట్ కార్డులు ఉన్నాయా అని సమాధానం చెప్పగా తన వద్ద ఉన్న మరో మూడు బ్యాంకులకు సంబం ధించిన క్రెడిట్ కార్డుల వివరాలను సదరు వ్యక్తికి చెప్పాడు. తీరా రాత్రి మిగతా బ్యాంకుల క్రెడిట్ కార్డుల వివరాలను ఎందుకు అడిగి ఉంటాడని అనుమానం వచ్చిన జగన్నాథం తన జాతీయ బ్యాంకు ఖాతా వివరాలను పరిశీలించగా అందులో రూ.1,61,353లు కట్ అయినట్లు గుర్తించాడు. వెంటనే మరో బ్యాంకు ఖాతా చూడగా అందులో నుంచి రూ.1,30,000, ఇంకో బ్యాంకు ఖాతాలో నుంచి రూ.3,87,093లు కట్ అయినట్లు తెలుసుకొని, వెంటనే ఫోన్ చేసిన వ్యక్తికి కాల్ చేయగా నీ డబ్బులు నీ బ్యాంకు ఖాతాలో జమ అవుతాయని నమ్మబలికాడన్నాడు. అయితే తన డబ్బులు మరుసటి రోజు కూడా జమ కాకపోవడంతో మోసపోయినట్లు గుర్తించిన బాధితుడు కురవి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సతీష్ తెలిపారు.




# మీ గొంతుక!
# మీ నమ్మకం!

## అక్షర దర్బార్

ప్రతి అక్షరం.. ప్రజా సంక్షేమం!

## ఎందుకు అక్షర దర్బార్?

- **నిజమైన వార్తలు** : నిష్పక్షపాతంగా, పారదర్శకంగా వార్తలను అందిస్తాం.
- **మీ సమస్యల పరిష్కారం** : స్థానిక సమస్యల నుండి ప్రభుత్వ పథకాల అమలు వరకు, మీ ప్రతి సమస్యను వెలుగులోకి తెస్తాం.
- **సమాజహితమే లక్ష్యం** : ప్రజల గొంతుకగా మారి, సామాజిక బాధ్యతతో పనిచేస్తాం.
- **ఈ-పేపర్ అందుబాటులో** : ఎక్కడ ఉన్నా, ఎప్పుడైనా మీ వార్తలను చదవండి.

**డిజిటల్ విప్లవంలో భాగంకండి!**

"అక్షర దర్బార్" ఈ-పేపర్ కోసం QR కోడ్‌ను స్కాన్ చేయండి.

వేగంగా, సులభంగా వార్తలను పొందండి.

**ప్రతిరోజూ మీ ఇంటికి, మీ మనసుకి చేరువగా "అక్షర దర్బార్"!**

## మీ నమ్మకమే మా బలం!

Printed, Published & Owned by VEMULA RAJESHWER RAO, printed at VR PUBLICATIONS, H.NO 7-1-364/16/A, Sriram Nagar, Padmakshi gutta colony, Hanamkonda, Pin 506001, Telangana State.
Editor : VEMULA RAJESHWAR RAO, Email : aksharadarbarnews@gmail.com, Office No:7680992278 *RNI NO.TELTEL/2022/81915